ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2, కనిష్ఠం 19.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

గురువారం 21 మార్చి 2024



అసమ్మతి.. గుబులు

- బీజేపీ తొలి ప్రచార సభకు డుమ్మాకొట్టిన ముఖ్యనేతలు
- ఎంపీ సోయం బాటలోనే మాజీ ఎంపీ రాథోడ్ రమేష్
- కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న బోథ్ మాజీ ఎమ్మెల్యే?
- పార్టీ అభ్యర్థికి మద్దతుపై సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు
- లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీలో మొదలైన అసమ్మతి లొల్లి



ఆదిలాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అందరికంటే ముందున్న కమలం పార్టీని అసమ్మతి గుబులు వెంటాడుతోంది. సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తన ఖాతాలో వేసుకునేందుకు ఆరాట పడుతున్న బీజేపీకి అప్పుడే ఆటంకాలు మొదలయ్యాయి. ప్రధాని మోదీ జిల్లా పర్యటన తర్వాత కొంత స్పీడును పెంచినా.. అసమ్మతి నేతలు అలక వీడక పోవడంతో ఐక్యత కనిపించడం లేదు. ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీజేపీ మరోసారి గెలిచేందుకు పక్కాప్లాన్‌తో ముందుకెళ్తోంది. కానీ టికెట్ ఆశించినా.. దక్కకపోవడంతో పలువురు ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి.. కొత్తగా పార్టీలో చేరిన వలస నేతకు టికెట్ కేటాయించడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత తొలిసారి తలమడుగు మండలంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి కేంద్రమంత్రి అర్జున్‌ముండా హాజరైనా.. పలువురు ముఖ్య నేతలు డుమ్మాకొట్టడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గత కొద్దిరోజులుగా సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. బుధవారం నిర్వహించిన సమావేశానికి పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నేతలు హాజరుకాక పోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీలో ఓవర్గం నేతలంతా పార్టీ అభ్యర్థి ఎంపికను వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తుంది. ఎందు కంటే పార్టీలో అర్హులైన అభ్యర్థులు ఉండగా.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎన్నికల హడావుడి మొదలైనా.. నేతలు కలిసి కట్టుగా ముందుకు వెళ్లకపోవడంతో పార్టీ అభ్యర్థి గెలుపుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గేదే లేదంటున్న నేతలు

గత కొన్నేళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్నా.. చివరకు టికెట్ దక్కకపోవడంతో అధిష్ఠానం తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న పలువురు నేత లు తగ్గేదే లేదన్న ఉద్దేశంతో ఉన్నట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుతో పాటు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోక ప్రవీణ్‌రెడ్డి, బీజేవైఎం నేత రాళ్లబండి మహేందర్, రైల్వేబోర్డు మెంబర్ జీవి రమణ, పలువురు ఇతర ముఖ్యనేతలు సోయం బాటలోనే ముందుకెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పార్టీ అగ్రనేతలు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నా.. అసమ్మతి నేతలు వెనుకడుగు వేసినట్లు కనిపించడం లేదు. తలమడుగు మండలంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు బీజేపీ కండువా వేసుకున్నా.. ఆశించినస్థాయిలో చేరికలు జరుగలేదన్న టాక్ వినిపిస్తోంది. అసమ్మతి నేతలే చేరికలను అడ్డుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల ఓటమికి కారణమైన నేతకు లోక్‌సభ ఎన్నికల్లో మద్దతును ఇచ్చేందుకు పలువురు నేతలు వెనుకాడుతున్నట్లు తెలుస్తుంది. కొందరు పైపైకి బాగానే కనిపిస్తున్నా.. లోలోన పార్టీ నిర్ణయంపై రగిలి పోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

పార్టీ అభ్యర్థికి మద్దతు అనుమానమే..

గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఊహించని విధంగా ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు ఒకే పార్టీ గూటికి చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ రాకపోవడంతో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బీజేపీలో చేరిపోయారు. ఆ తర్వాత సామాజిక సమీకరణల్లో భాగంగా ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులను బట్టి మాజీ ఎంపీ గోడం నగేష్‌ను పార్టీలో చేర్చుకున్న బీజేపీ.. ఆయనకు ఎంపీ టికెట్‌ను కేటాయించింది. దీంతో మాజీ ఎమ్మెల్యే ఆగ్రహానికి అసలు కారణమైంది. బీఆర్‌ఎస్‌లో తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్న గోడం నగేష్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వడం ఇష్టం లేకనే రాథోడ్ బాపురావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో నేఓ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే బోథ్ నియోజకవర్గంలోని తన అనుచరులు, సన్నిహితులతో చర్చించినట్లు సమాచా రం. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే కాంగ్రెస్ గూటికి చేరిపోవడం ఖాయంగానే కనిపిస్తుందన్న టాక్ జోరుగా వినిపిస్తోంది.

నేతల మధ్య వర్గ విభేదాలు

సొంత పార్టీ నేతలెవరూ పార్లమెంట్ ఎన్నికలకు పనికి రారన్నట్లుగా పక్కన పెట్టిన అధిష్ఠానం.. కొత్త నేతకు టికెట్ ఇవ్వడంపై బీజేపీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీపై ఓటమి పాలైన అభ్యర్థికే మళ్లీ టికెట్ ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఓ వర్గం నేతల మద్దతుతోనే పార్టీ అభ్యర్థి ఎంపిక జరిగిందంటూ మరో వర్గం నేతలు ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ముందుండి చక్రం తిప్పారన్న వార్తలు రావడంతో కొంతమంది నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గతంలో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఆదిలాబాద్ ఎమ్మెల్యేపై బహిరంగంగానే తీవ్రమైన ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అలాగే గోడం నగేష్‌తో తీవ్ర విభేదాలు ఉన్న బోథ్ మాజీ ఎమ్మెల్యే, మరికొంతమంది నేతలు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో గోడం నగేష్ ఎంఐఎం పార్టీకి సహకరించారన్న ఆరోపణలతో ఓ వర్గం నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. ఇలా సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పార్టీ అభ్యర్థి గెలుపు అవకాశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం బీజేపీలో రెండు వర్గాలుగా విడిపోయి పని చేస్తున్న నేతలు.. సొంత పార్టీ అభ్యర్థి పైననే విమర్శలు చేయడం ప్రతిపక్షాలకు కలిసి వచ్చే అవకాశంగా కనిపిస్తోంది.



కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న ప్రజాప్రతినిధులు

పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఖాయం

- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్‌ముండా
- జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ

తలమడుగు, మార్చి 20: దేశం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీని ప్రధాని చేసేందుకు ప్రతీఒక్కరు ముందుకు రావాలని, త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు రావడం ఖాయమని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా అన్నారు. బుధవారం మండలంలోని ఉండం గ్రామంలో బీజేపీ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడంతో దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి 400 సీట్లు రావడం ఖాయమన్నారు. దేశం కోసం మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన కోసం మనం ఐక్యంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఆయన 60 ఏళ్ల జీవితంలో 30ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసుల జిల్లా అని ఇక్కడ జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన ఆదివాసీల ముద్దుబిడ్డ కొమురంభీం స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ రావడంతోనే ఆదివాసీ రాష్ట్రాల్లో గిరిజనుల అభివృద్ధి జరిగిందన్నారు.

● విలువలకు కట్టుబడి ఉన్నది మోదీ ప్రభుత్వం ఒక్కటే..
: బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్

తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలు.. ఎన్నో ప్రభుత్వాలను చూశానని, విలువలకు కట్టుబడి ఉన్నది మాత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కటేనని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశం కోసం చేస్తున్న సేవ చూసి బీజేపీలో చేరడం జరిగిందని ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉండం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం మోదీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు కేంద్రమంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు. ఇందులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, జిల్లా నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, రత్నాకర్ రెడ్డి, తాంసి జడ్పీటీసీ రాజు, తలమడుగు మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, మండల కన్వీనర్ చంద్రకాంత్, వెంకట్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా
- కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటలిజెంట్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, బ్యాంకర్లతో సమీక్షా సమావేశం పాల్గొన్న
- ఎస్పీ గౌస్‌ఆలం, అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 20: అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా అన్నారు. భుదవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి ఇంటలిజెంట్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రూ.యాభై వేల నుంచి రూ.పది లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే.. కచ్చితంగా రషీదు ఉండాలని పేర్కొన్నారు. అంతేకాకుండా రూ.10లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదా య పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందన్నారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకువచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్దమొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈవో నుంచి అనుమతి తప్పని సరిగా పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, క్యాష్ జెనరేట్ చేయడానికి క్యూ ఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికల్ నంబర్‌లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతీ రోజు క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాటిని ఎలక్షన్ సీజర్ మేనేజిమెంట్ సిస్టమ్ పోర్టల్లో (ఈఎస్ఎంఎస్) నమోదు చేయాలని, ఎన్నికల పారదర్శకత నిర్వహణలో భాగంగా ఎన్నికల నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమలు, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీములు నిఘా, పర్యవేక్షణలో పట్టుకున్న డబ్బు, మద్యం, బంగారం, డ్రగ్స్ విలువైన వస్తువుల వివరాలను పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏ దశలోనూ లోపాలు లేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడ ఏచిన్న తప్పిదానికి తావివ్వకుండా వంద శాతం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బృందాలను పూర్తి స్థాయిలో పని చేసేలా చూడాలన్నారు. నిఘా బృందాలు తమకుకేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వహించాలని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించిన బృందాలు ఏ ఏ ప్రదేశాల్లో ఏర్పాటు చేసింది అడిగి తెలుసుకున్నారు. ఏఆర్‌వోలు నిఘా బృందాల పర్యవేక్షణ చేయాలన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు వందశాతం చేయాలని, పోలింగ్ కేంద్రాల వెలుపల సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏఆర్‌వోలు, పోలీసు అధికారులు తమ పరిధిలోని ప్రతీఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, మౌళిక సదుపాయాల పరంగా, భద్రత పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యచరణ చేయాలన్నారు. సువిధసింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేయాలని, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులు జారీ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా రవాణా కార్యచరణ పకడ్బందీగా చేయాలని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఆయా సెగ్మెంట్ల పరిధిలోను, రిసిప్షన్ కేంద్రం ఒకేచోట కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి, రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. ఎన్నికల పరిశీలకుల సందర్శనలోగా కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సి-విజిల్‌పై విస్తృత





సమావేశంలో పాల్గొన్న అధికారులు, బ్యాంకు అధికారులు
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా)

చేయాలన్నారు. యువతతో సమావేశాలు నిర్వహించి, సి-విజిల్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసిన వివరాలతో కూడిన నివేదిక, రిజిస్టర్ ఏర్పాటు చేయాలని, ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, ప్రతీ చెక్‌పోస్టులో వీడియోగ్రఫి సరిగా చేయాలని, అప్రమత్తంగా ఉంటూ 24గంటల పటిష్ట నిఘా సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలదేవి, ఏఎస్‌డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎల్డీఎం, బ్యాంకర్లు, ఎలక్షన్ సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి'

ఆదిలాబాద్ అర్బన్: ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతీ ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ప్రింటింగ్ ప్రెస్ ఫ్లెక్సీ యజమానులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతీ ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రచార సామగ్రి ప్రింటింగ్ చేసేటప్పుడు పాటించవల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ప్రచారం కోసం ఇచ్చే కరపత్రాలు గోడ ప్రతులు ఫ్లెక్సీలపై ప్రచారం ఇచ్చే వారి వివరాలు నిర్ణీత ప్రోఫార్మాలో ప్రింటింగ్ ప్రెస్ ఇవ్వాలని, నియమాలను అతిక్రమిస్తే తగిర చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ?

- ఉపాధ్యాయ పదవికి రాజీనామా
- అధికారిక ప్రకటనపై కొనసాగుతున్న ఉత్కంఠ



ఆదిలాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ మహిళ నేత ఆత్రం సుగుణను ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. దాదాపుగా ఆమె అభ్యర్థిత్వం ఖరారు అయినట్లు తెలుస్తుంది. పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోనే ఇప్పటికే ఆమె ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఉపాధ్యాయురాలుగా కొనసాగుతున్న సుగుణ గత కొన్నిఏళ్లుగా ఆదివాసీ మారుమూల గ్రామాల్లో సేవలు అందిస్తూ వస్తుంది. గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా నేతలను కలుస్తూ తనకు టికెట్ వస్తే మద్దతుగా నిలువాలని కోరుతోంది. అలాగే డాక్టర్ సుమలతతో పాటు ఆత్రం భాస్కర్ పేర్లను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు..

- బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తెలిపారు. పట్టణంలో బుధవారం ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. దీనిలో భాగంవగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్, పార్టీ ముఖ్య నాయకులు జాన్సన్ నాయక్, రాంకిషన్ రెడ్డి, లోలం శ్యాంసుందర్, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రణాళికలు, ప్రచార వ్యూహాలు, ఇతరాత్ర అంశాలపై చర్చించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని అయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీష్‌రావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీల ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై చర్చించినట్లు ఆయన వివరించారు.



గిమ్మాలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

గ్రామాల్లో అక్రమ మద్యం సీజ్

- ఇద్దరిపై కేసు నమోదు : రూరల్ సీఐ సాయినాథ్

జైనథ్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్, ఎస్సై కె.పురుషోత్తం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో గల బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా జైనథ్ మండలంలోని గిమ్మా, మేడిగూడ గ్రామాల్లో గల బెల్ట్‌షాపులపై దాడులను నిర్వహించి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గిమ్మాలో రూ.65వేల విలువ చేసే 96 లీటర్ల మద్యాన్ని మేడిగూడలో రూ.25వేల విలువ చేసే 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గిమ్మా బెల్ట్‌షాపును నడుపుతున్న మదస్తు సాయి, మేడిగూడ బెల్ట్‌షాపు నడుపుతున్న డోకే సంతోష్‌లపై కేసులు నమోదు చేశారు.

● అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

బోథ్: మండలంలోని కౌటా(బి) గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.రాము తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.41,600 ఉన్నట్లు ఆయన తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపైనా దృష్టి సారించాలి

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కిషన్

గుడిహత్నూర్, మార్చి 20: రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపైనా దృష్టి సారించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని గురుజలో నిర్వహించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల నోరు కాలి గిట్టల మధ్య పుండ్లు రావడం అతిగా జ్వరం ఉంటే గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని చెప్పారు. అందుకే వ్యాధి వచ్చిన తరువాత వైద్యం చేయించుకోవడం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించాలన్నారు. గురుజ, గొండ్, హర్కపూర్, ఇన్రుగూడ గ్రామాల్లో 337 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గురుజలో పశువులకు టీకా వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్ సా.6.33	సహర్ ఉ.4.57



అల్లాహ్ తన వెలుగు వైపునకు.. తనకు ఇష్టమైన వారికి మార్గం చూపుతాడు.

అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడ కార్యక్రమం

నేరడిగొండ, మార్చి 20: మండల కేంద్రంలోని మథురనగర్ కాలనీలో గల 3వ అంగన్‌వాడీ కేంద్రంలో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే (వీహెచ్ఎస్ఎన్‌డీ) పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక వార్డు సభ్యుడు సాబ్లె సంతోష్‌సింగ్ పోషకాహార విలువల గురించి గర్భిణులకు, బాలింతలకు చెప్పడం జరిగింది. శానిటైజేషన్ గురించి ఐఎఫ్ఏ మాత్రల గురించి, శుభ్రత గురించి కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు వివరించడం జరిగింది. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి, ఆశావర్కర్ గీత, అంగన్‌వాడీ హెల్పర్ జ్యోతి, గర్భిణులు, బాలింతలు, తదితరులున్నారు.



పోషన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే.లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలు సంఘటితంగా పోరాడాలన్నారు. 2024లో సంఘం మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ మిత్రపక్షాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చిందన్నారు. మహిళల హక్కులు కాలరాస్తున్నారన్నారు. మహిళలపై హింస, దోపిడీ, అణచివేత కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరువు హత్యలు సమర్థించే సంస్కృతిని పెంచి పోషిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణగా ఉన్న 498ఏ లాంటి చట్టాలు నీరుగారుస్తున్నారని ఆరోపించారు. బీజేపీ మనోన్మాత చర్యలను ప్రతిఘటించాలన్నారు. మహిళా నాయకులు ముత్తవ్వ, గంగామణి, ఎస్. లక్ష్మి, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కనీస మద్దతు ధర 2070 కాకుండా తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. భైంసా డివిజన్‌లో గణనీయంగా మొక్కజొన్న సాగు పెరిగిందని తెలిపారు. నాయకులు డి. నూతన్‌కుమార్, తిరుపతి, నర్సయ్య, బర్కుంట గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటల పరిశీలన

● 'అకాల' నష్టాన్ని అంచనా వేసిన అధికారులు ● సిరికొండ మండలంలో దాదాపు 300 ఎకరాల్లో నేలకొరిగిన పంటచేలు

సిరికొండ, మార్చి 20: మండలవ్యాప్తంగా ఈదురు గాలులతో కురుస్తున్న అకాల వర్షాలకు పలు రకాల పంటచేలు నేల పాలయ్యాయి. మరో నెల రోజుల్లో చేతికి వస్తాయనుకుంటున్న తరుణంలో పంటలు నేలకొరగడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు రోజులుగా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వాన కురవడంతో ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురవడంతో పంట నష్టం తీవ్రత మరింత పెరిగింది. అలాగే ఈదురుగాలులతో కురిసిన వర్షంతో పలు ఆదివాసీ గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపడడంతోపాటు మట్టితో నిర్మించిన ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. దీంతో సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్ శాఖలకు సంబంధించిన సిబ్బంది స్పందించి తక్షణ చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసి, ప్రభుత్వానికి పంపించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. దీంతోపాటు పలు ఆదివాసీ గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను పంపించినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ రోహిదాస్, లింగన్న, మల్లయ్య, మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ విలాస్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తితో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే

బోథ్, మార్చి 20: మండలంలోని కౌటా(బి) గ్రామంలో బుధవారం నిర్వహించిన శబరిమాత ఆలయ 12వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. శబరిమాత ఆశ్రమ భక్తులు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జిల్లాలోని వివిధ ఆశ్రమాల నుంచి భక్తులను ఆహ్వానించడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా శబరిమాత ఆశ్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. సమీప భవిష్యత్తులో ఆశ్రమాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కాగా వార్షికోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల భక్తులతో కలిసి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన శివానంద స్వామితో పాటు శబరిమాత శిష్యులు అల్లూరి నర్సింగ్‌రెడ్డి, తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు.

'పంటల నష్ట పరిహారం అందించాలి'

తలమడుగు, మార్చి 20: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వడగండ్ల వానతో చేతికొచ్చిన పంటలు నేలమట్టమై రైతులు ఆర్థికంగా నష్టపోయారని వెంటనే ప్రభుత్వం సర్వే చేయించి ఎకరానికి రూ.50వేల ఆర్థిక నష్టపరిహారం అందించాలని బుధవారం మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ మాట్లాడుతూ మండలంలో దాదాపు మూడు రోజుల పాటు కురిసిన భారీవర్షాలతో 5వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, వెంటనే సర్వే చేయించి ఎకరానికి రూ.50వేలు ఆర్థిక నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేదరేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బరంపూర్ ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, తోట ప్రమోద్, లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: గత మూడు రోజులుగ కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంటనష్టపోయిన రైతులందరికి ప్రభుత్వం తరుపున తగిన నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ అన్నారు. అకాల వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటలను పరిశీలించేందకు ఏడీఏ శ్రీధర్ స్వామీ వచ్చి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు దీసి విజేందర్, ప్రభాకర్, రాములు, లక్ష్మణ్, సుకుమార్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'

ఉట్నూర్, మార్చి 20: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మండల పంచాయతీ అధికారి లింగయ్య అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలలోని షాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రామ ఆరోగ్య పారిశుధ్య, పోషక ఆహారం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతీఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు సంక్రమిస్తాయఅన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మహిళలు, బాలింతలు, గర్భిణులలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఇది ఇలా ఉండగా ఉట్నూర్ మండలంలోని లక్కారం, ఉమ్రి, లక్షేటిపేట్, షాంపూర్ అంగన్‌వాడీ కేంద్రా లలో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, డాక్టర్ రాథోడ్ సంజయ్, హెచ్ఎం భరత్‌చౌహాన్, ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ లింగమ్మ, ఐసీడీఎస్ టీచర్ కాటం సంగీత రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మహిళలు, చిన్నారులు పౌష్టికాహారంతో రక్త హీనత సమస్యలు తొలుగుతాయని ఎంపీవో సుధీర్‌రెడ్డి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సీతాగొంది అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించడానికి కేంద్ర ప్రభుత్వం పోషణ్ పక్వాడ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: పోష్టిక ఆహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో నరసింహ కోరారు. బుధవారం మండలంలోని కజ్జర్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పోస్టు వ్యవహార పదార్థాలను తీసుకోవాలన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. అదే విధంగా మహిళలు ఇలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య సిబ్బంది సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం పోషక అభియాన్ ఫస్ట్ వ్యవహారంపై అవగాహన కల్పించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలు శోభరాణి, అనసూయ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి : వికాస్ మెహతా

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 20: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మెహతా అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్టీయూ భవన్‌లో ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకు వారు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ర్యాలీలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాటలు పాడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మెహతా మాట్లాడుతూ తాము చదువుకునే సమయంలో ఓటరు నమోదుకు ఇలాంటి సౌకర్యాలు లేకుండేవని తెలిపారు. అర్హత కలిగిన ప్రతీఒక్కరిని ఓటరుగా నమోదు చేసేలా ఎన్నికల సంఘం సూచనల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఫాం-6 పూరించి తహసీల్దార్ లేదా సంబంధిత బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. అదేవిధంగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మోడల్‌కోడ్ అమలులో ఉందని, ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు తెలిస్తే వెంటనే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, డీవైఎస్‌వో వెంక టేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ దిలీప్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భరద్వజ, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆదలాబాద్ అర్బన్, మార్చి 20: గత అసెంబ్లీ ఎన్నికల్లో పాయల శంకర్ గెలవాలని స్థానిక రామ్‌నగర్ కాలనీలోని బీజేపీ కార్యకర్తలు స్థానికంగా ఉన్న పోచమ్మ ఆలయంలో మొక్కుకున్నారు. ఈ సందర్భంగా వారి మొక్కు తీరినందుకు పాయలశంకర్, కార్యకర్తలు పోచమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బోనాలు వేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ తల్లి దయ వల్లే తాను గెలిచానని కార్యకర్తల అండ ఎప్పుడు తనకు ఉంటుందన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో పట్టణంలోని ప్రజలు పిల్లాపాపలందరు సుఖశాంతులతో ఉండాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చినట్టుగానే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ ఆదిలాబాద్ నియోజకవర్గం అభ్యర్థి గోడం నగేష్ మద్దతు తెలిపి ఆయనను పూర్తిమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన పాయల

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రి అర్జున్‌ముండాకు ఎమ్మెల్యే పాయల శంకర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రిని నాయకులు కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం పార్టీ నాయకులతో కేంద్ర మంత్రి జిల్లా రాజకీయాల గురించి చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గోడంనగేష్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆడియో కలకలంపై ఇంటలిజెన్స్ ఆరా!!

ఉట్నూర్, మార్చి 20: పదవ తరగతి పరీక్షలో ప్రశ్నపత్రం కాగితంపై రాసుకొని బయటకు తెచ్చామని మంగళవారం సాయంత్రం విడుదలైన ఆడియో క్లిప్పింగ్‌పై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. మంగళవారం జరిగిన హిందీ పరీక్షలో ఒక పాఠశాల నుంచి ప్రశ్నలు బయటకు తెప్పించుకుని తమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు జవాబులు పంపించామని సామాజిక మాధ్యమం ద్వారా ఆ పాఠశాల ఉపాధ్యాయుడుతో పాటు ఇది వరకు ఈ పాఠశాలలో పని చేసి తొలగింపునకు గురైన ఉపాధ్యాయుడు మాట్లాడుకున్న ఆడియో కలకలం రేపింది. ప్రైవేట్ పాఠశాలపై కక్ష కట్టుకొని తప్పుడు ప్రచారం ద్వారా పాఠశాలను అప్రతిష్ట పాలు చేయడానికి తొలగింపునకు గురైన ఉపాధ్యాయుడు కృషి చేసినట్లు ఇంటలిజెన్స్ అధికారులు భావిస్తున్నారు. ఇరువురి సంభాషణ వాయిస్ రికార్డింగ్‌పై ఆరా తీసి సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధత శాఖ ఉన్నత అధికారులు భావించినట్లు తెలుస్తుంది.

యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

● నిర్మల్ జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధం ● అన్ని కేంద్రాలు మహిళా సంఘాలకే కేటాయించిన జిల్లా కలెక్టర్ ● ఈ ఏడాది యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం 1.79 లక్షల మెట్రిక్ టన్నులు ● ఏప్రిల్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు ● ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,203



లారీలో తరలిస్తున్న కొనుగోలు చేసిన ధాన్యం (ఫైల్)



కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

ఖానాపూర్, మార్చి 20 : రాత్రనకా పగలనకా శ్రమించి రైతన్న పండించే యాసంగి ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎటువంటి ఇక్కట్లు కలగవద్దని ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇదివరకే జిల్లాలో సాగు చేసిన వరిపంటకు అనుగుణంగా వచ్చే దిగుబడిని అంచనా వేసిన అధికారులు ఆ దిశగా ధాన్యం కొనుగోలు చేసి రైతన్నకు అండగా నిలిచేలా ప్రభుత్వం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అన్ని చర్యలను చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా వచ్చే వరి పంట దిగుబడికి అనుగుణంగా జిల్లాలో 203 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వరిపంట మరో 15 రోజుల్లో చేతికి వస్తుందనగా ముందస్తుగానే అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచడం పట్ల జిల్లా రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసిన విధంగానే కొనుగోలు కేంద్రాలు కూడా ధాన్యం చేతికందే సమయానికి ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకే..

రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. ఒక పక్క తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నింటిని ఐకేపీకే అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో 2023-24 యాసంగి సీజన్‌లో 109902 ఎకరాలలో వరి పంటలు సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన వ్యవసాయ భూమిలో ప్రస్తుతం 1.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీంతో ఈ ఏడాది యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం 1.97 లక్షల మెట్రిక్ టన్నులుగా విధించుకొని జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 203 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ధాన్యం కేంద్రాలన్నింటినీ మహిళా సంఘాలకే కేటాయించి వారిని ధాన్యం కొనుగోళ్లలో మరింత ప్రోత్సహించేలా జిల్లా యంత్రాంగం దృష్టి సారించినట్లు చెబుతున్నారు.

దళారులకు చెక్ పెట్టేలా
ఏప్రిల్ మొదటి వారంలోనే కొనుగోలు కేంద్రాల ప్రారంభం

రైతన్న శ్రమించి పండించిన ధాన్యం చేతికి అందిన తర్వాత దళారుల పాలు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. దళారులకు చెక్ పెట్టేలా ధాన్యం కొనుగోళ్లను ఏప్రిల్ మొదటి వారంలోనే ప్రారంభించాలని జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. పంట చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే అప్పటికే అప్పో సప్పో చేసి పండించిన పంటను రైతులు తమ అక్కరెను ఒడ్డెక్కించుకునేందుకు తక్కువ ధరకు దళారులకు విక్రయించే అవకాశం ఉన్నందున ఆ పరిస్థితి తలెత్తకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించే ధాన్యంలో 17 శాతం తేమ ఉండేలా చూసుకోఅలని రైతులకు అధికారులు చెబుతున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2023, సాధారణ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2183 మద్దతు ధరను చెల్లించి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు.

గన్ని బ్యాగులు,
టార్పాలిన్ల కొరత లేకుండా చూడాలంటున్నరైతాంగం

ప్రతి ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తలెత్తే సమస్యల్లో ప్రధానమైన సమస్యలుగా మారుతున్న గన్ని బ్యాగుల కొరత, టార్పాలిన్ కవర్ల కొరతను ఈసారైనా అధిగమించాలని జిల్లా రైతాంగం అధికారులను కోరుతోంది. ఈ ఏడాది కొనుగోలు చేసే 1.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం మొత్తం 49 లక్షల గన్ని బ్యాగులు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రస్తుతానికి జిల్లాలో 32 లక్షల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. మరో 17 లక్షల గన్ని బ్యాగులను కొనుగోలు కేంద్రాల ప్రారంభ సమయానికి అందుబాటులోకి తెస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్ కవర్లను సైతం ప్రభుత్వమే అందుబాటులో ఉంచితే బాగుంటుందని జిల్లా వ్యాప్తంగా పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సేకరించిన ధాన్యాన్ని వెను వెంటనే రైస్ మిల్లులకు పంపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాల్ ధాన్యం కొనుగోలు చేస్తే అదనంగా ఐదు నుంచి 8 కిలోల వరకు తూకం చేసే వారిని ప్రస్తుతం ఆ సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా రైతాంగం కోరుతోంది. ధాన్యం సేకరించిన తర్వాత లారీల కొరత ఏర్పడి మిల్లుకు ధాన్యాన్ని తరలించడంలో గతలో పలుచోట్ల ఆలస్యమైనందున ఈసారి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గన్ని బ్యాగులు, టార్పాలిన్ల కొరత లేకుండా చూడాలి



కొనుగోలు కేంద్రంలో గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్ల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే ధాన్యాన్ని తరలించే లారీల కొరత లేకుండా చూడాలి.

- రామిడి మహేష్,
యువరైతు, తర్లపాడ్

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8, కనిష్ఠం 20.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 21 మార్చి 2024



కాంగ్రెస్‌లో.. చేరికల జోరు



- పార్టీలో చేరికలపై శ్రీహరిరావు వ్యూహం
- ఇప్పటికే ఇద్దరు కౌన్సిలర్‌లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా
- నేడో రేపో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం
- అదే బాటలో మంత్రి సన్నిహిత అనుచరుడు
- ఆయన వెంట భారీ సంఖ్యలో చేరికలు

నిర్మల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో రాజకీయ పరిణామాలు రోజుకో రీతిన మలుపులు తిరుగుతున్నాయి. ఆ పార్టీలో చేరేందుకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జరుపుతున్న ప్రయత్నాలను ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలు గత కొద్దిరోజుల నుంచి అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు ఇప్పటికి కొనసాగుతున్నాయి. దీంతో పాటు అటు సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు అల్లోల వ్యతిరేక వర్గీయులు ఫిర్యాదులు చేశారు. అల్లోలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే పార్టీ ప్రతిష్ఠ దిగజారుతుందంటూ వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఇక కౌంట ర్ జాయినింగ్ యాక్షన్‌ప్లాన్‌కు శ్రీకారం చుడుతున్నారంటున్నారు. ఇందు లో భాగంగానే మంత్రికి సన్నిహితులైన వారిని వేరు వేరుగా తన ఆధ్వ ర్యంలోనే కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు శ్రీహరిరావు పావులు కదుపుతున్నారంటున్నారు. ఇందుకు అనుగుణంగా ఇద్దరు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీరు రెండు మూడు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. అయితే వీరితో పాటు మరో వారం రోజుల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి సన్నిహితుడైన ఓ కీలకనేత తన అనుచరవర్గంతో కాంగ్రెస్ పార్టీ లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటున్న నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్‌ను కాపాడుకునే క్రమంలోనే సదరు నేత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఈ నేతతో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఇప్ప టికే చర్చలు జరిపారని చెబుతున్నారు. ఈయనతో పాటు మరికొన్ని మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరిరావు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు పేర్కొంటున్నారు. ఈ చేరికల ద్వారా ఇంద్రకరణ్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నాలు ఇక తీవ్రంకానున్నాయంటున్నారు. ఇప్పటికే చేరికల వ్యవహారం ఇక్కడి రాజకీయ వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారిని సంగతి తెలిసిందే. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై తన అనుచరులతో సమాలోచనలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఆయన హైదరాబాద్ స్థాయిలో తన చేరిక అంశంపై పార్టీ ముఖ్యనేతలతో మంతనాలు సైతం సాగిస్తున్నారంటున్నారు. అన్ని చోట్ల బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇటు కాంగ్రెస్ అటు బీజేపీ పార్టీలో పోటాపోటీగా చేరుతున్నప్పటికి ఒక నిర్మల్ నియోజకవర్గంలోనే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేరిక వ్యవహారం వివాదాస్పదమవుతుండడం చర్చకు తావిస్తోందంటున్నారు. ఆయన చేరి క కారణంగా పార్టీలో సీనియర్‌లమైనా తామంతా వెనకడుగు వేయాల్సి వస్తుందని వ్యతిరేఖ వర్గీయులు భావిస్తున్నారు.

వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న శ్రీహరిరావు

కాగా కాంగ్రెస్ పార్టీలో చేరికల వ్యవహారంపై డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారంటున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నేతగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించి ఆ పార్టీ తరపున రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీహరిరావు గత అనుభవాలను తెరపైకి తెస్తున్నారు. బహుజన సమాజ్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీహరిరావు వర్గాన్ని పక్కన పెట్టారన్న ఆరోపణలున్నాయి. క్రమంగా శ్రీహరిరావును పార్టీ నుంచి బయటకు వెళ్లే విధంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చర్యలు దోహదపడ్డాయంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీని వీడిన శ్రీహరిరావు కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా పార్టీ నుంచి మరోసారి ఎన్నికల్లో పోటీ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఇంద్రకరణ్‌రెడ్డి రెండుసార్లు మంత్రి పదవిని సైతం చేపట్టారు. అయితే మొన్నటి ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. కాగా ఈ ఓటమిని జీర్ణించుకోలేని ఆయన వర్గీయులు అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ ఆయనపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. దీని కారణంగానే ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లయితే మళ్ళీ తమకు ఇబ్బందులు మొదలవుతున్నాయన్న అభిప్రాయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ వర్గీయులున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుపై వీరంతా పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తూ ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోకుండా చూడాలని కోరుతున్నారు. దీంతో పాటు ఇంద్రకరణ్ రెడ్డికి వ్యతిరేఖంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుండడం ఇక్కడి రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకేత్తిస్తోందంటున్నారు.

చేరికలకు భారీ వ్యూహం

మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేరిక వ్యవహారంపై జరుగుతున్న ప్రచారానికి కనీసస్థాయిలో ప్రాధాన్యత లేకుండా చేసేందుకు శ్రీహరిరావు ఎత్తుగడలు వేస్తున్నారంటున్నారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ తన ఆధ్వర్యంలో పార్టీలో చేర్పించాలని ఆయన యోచిస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి అనుగుణంగానే మంత్రికి సన్నిహితుడైన ఓ మాజీ ప్రజాప్రతినిధి వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్‌లు పార్టీకి రాజీనామా చేసి నేడో రేపో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలకనేత చేరికకు సంబంధించి జరుగుతున్న ప్రయత్నంలో భాగంగానే ఈ ఇద్దరు కౌన్సిలర్‌ల చేరిక అంశం ముడిపడి ఉందంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీలో కౌంటర్ చేరికల వ్యవహారం చర్చకు తావివ్వబోతోందని అంటున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వ్యూహాత్మకంగా తాము వ్యతిరేఖిస్తున్న నేతల చేరికను అడ్డుకునేందు కోసం కౌంటర్ కార్యక్రమాలను మొదలుపెట్టబోతున్నారంటున్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక

మామడ, మార్చి 20 : మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కే. గంగారెడ్డి మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ మండల రైతు సమితి అధ్యక్షుడు బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో పోతారం, అనంతపేట్, బండల ఖానాపూర్ గ్రామాలకు చెందిన తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ... అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అనుచరుల కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. మున్ముందు కూడా బీఆర్ఎస్ పార్టీ నుండి పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతారని తెలిపారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

- భక్తి శ్రద్ధలతో లక్ష్మీనారాయణ హోమం
- నేడు కల్యాణోత్సవం



ఉత్సవ మూర్తుల శోభాయాత్ర

లక్ష్మీనారాయణ హోమం

భైంసా, మార్చి 20 : పట్టణ పరిధిలోని పద్మావతికాలనీలో గల లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన వేడుకలు భక్తజన సందోహంతో కోలహలంగా జరుగుతున్నాయి. నిత్యం నిర్వహించే వేడుకలు ప్రత్యేకపూజ కార్యక్రమాలకు భక్తుల అధికసంఖ్యలో తరలివస్తున్నారు. వేడుకలలో భాగంగా బుధవారం ఉదయం యాగశాలలో శాంతిపాఠం. మూలమంత్ర హవనం, లక్ష్మీనారాయణ హవనం, నిత్య పూర్ణాహుతి. నివేదనలు, బలి హరణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాంగణంలో శోభాయాత్ర చేపట్టారు. సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి జరిపారు

నేడు కల్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వేంకటేశ్వరస్వామి వారికి - శ్రీదేవి, భూదేవిలతో కల్యాణ మహోత్సవం జరుగనుంది. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణవేదిక వద్దకు ఉత్సవమూర్తులకు శోభాయాత్రగా తీసుకవెళ్లి కల్యాణఘట్టాన్ని ప్రారంభించనున్నారు.. 11.45గంటలకు కల్యాణోత్సవం జరుగనుంది అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వేలాది మంది భక్తులు కల్యాణోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యతో తరలిరానున్న నేపథ్యంలో ఆలయ నిర్వాహక కమిటీ, శ్రీ మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ కమిటీ ప్రతినిధులు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు ఎలాం టి సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు గాను చర్యలు చేపట్టారు.

వైభవంగా పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



పూర్ణాహుతి పూజ నిర్వహిస్తున్న పండితులు ఇన్‌సెట్‌లో నూతన ఆలయంలో కొలువుదీరిన పంచముఖ ఆంజనేయస్వామి

దిలావర్‌పూర్, మార్చి 20 : మండలంలోని గుండంపల్లిలో బుధవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్రీ రామనామంతో పాటు ఆంజనేయ స్వామి చాలీసా పఠనంతో పులకించింది. వేద పండితులు సంజయ్‌శర్మ ఆధ్వర్యంలో హోమంతో పాటు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభంతో పాటు శివలింగం, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి మాలధారణ చేసిన భక్తులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

ఖానాపూర్, మార్చి 20 : గత మూడు రోజులుగా మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అత్యంత వైభవంగా సాగుతున్న అగ్గి మల్లన్న స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బ్రహ్మర్షి శెట్టిపల్లి మాధవాచార్యులు, వరంగల్‌కు చెందిన ఎలకంటి వెంకటాచార్యులు, తర్లపాడ్ ఓంకారేశ్వర స్వామి అర్చకులు మామిడిపల్లి హరీష్ కుమారాచారిల ఆధ్వర్యంలో ఆలయంలో దేవతా మూర్తులను ప్రతిష్ఠించారు. అగ్గి మల్లన్న ఆలయంలో అగ్గిమల్లన్నస్వామి, మేడాలమ్మదేవి, కేతమ్మదేవి, గణపతి, శ్రీ మహాశివ, నందీశ్వర విగ్రహాలను వేదమంత్రాల నడుమ పురోహితులు ప్రతిష్ఠించారు. ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ఆలయం పైన కలశము, శిఖరాన్ని సైతం ప్రతిష్ఠాపించారు. ఖానాపూర్, కడెం మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఆలయంలో యజ్ఞ హోమాది కార్యక్రమాలను నిర్వహించిన పండితులు బుధవారం ఉదయం 10:10 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. అగ్గి మల్లన్న విగ్రహ ప్రతష్ఠాపన సందర్భంగా ఆలయ ఆవరణలో పలు దుకాణ సముదాయాలను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా అగ్గి మల్లన్న స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీమార్ట్ నిర్ణయంపై కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : డీమార్ట్ ప్రభుత్వభూమిలో నిర్మిస్తున్నారని కలెక్టర్‌కు బీజేపీ ఎమ్మెల్యే, నాయకులు చేసిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలపై బుధవారం కలిసినట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలెక్టర్ డీమార్ట్ నిర్మాణ భూమి విషయంలో నిర్ణయం వెల్లడించేందుకు మరోవారం గడువు కోరినట్టు ఆ పార్టీ నాయకులు రావుల రాంనాథ్ తెలిపారు. అన్ని పరిశీలించి చర్యలకు కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. నిర్మల్‌లో డి- 1 పట్టాలు, అన్యా క్రాంతమైన భూముల విషయంలో చర్య కోసం కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. నాయకులు ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, జమాల్, దినేష్, న్యాయవాది అచ్యుత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఖానాపూర్, మార్చి 20 : 30 ఏళ్ల క్రితం తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు ముందుకు వచ్చి వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి 1993-94 లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే అనారోగ్యంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న ఖానాపూర్ విద్యానగర్ కాలనీకి చెందిన అనుప లక్ష్మికి తమ చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. ఇటీవల కాలంలో తీవ్ర అనారోగ్యానికి గురై తమ స్నేహితురాలు ప్రాణాపాయ స్థితిలో ఉందని తెలుసుకున్న 1993-94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల బృందం ఆమెను ఆదుకునేందుకు ముందు వచ్చారు. రూ. 65 వేలను బుధవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీఆర్ఎస్‌కు ఇద్దరు కౌన్సిలర్ల రాజీనామా

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : నిర్మల్ పట్టణ 16 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ తారకవాణి రఘువీర్, 8వ వార్డు కౌన్సిలర్ నల్లూరి పోశెట్టి బుధవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి వారు రాజీనామా లేఖను పంపించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్.. హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : వేసవికాలంలో ఎండల తీవ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీటి సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పనిచేయని బోర్‌వెల్స్ చేతి పంపులు, మరమ్మతులు చేయించాలన్నారు. నీటిసమస్య అధికంగా ఉన్న గ్రామాలకు ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. జాబ్‌కార్డు గల ప్రతి కూలీకి ఉపాధి హామీ పనుల క్రింద వంద రోజులు పని దినాలు కల్పించాలని ఆదేశించారు. వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి, రోడ్లు, మురికి కాలువలు తదితర నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నర్సరీలో మొక్కలను సంరక్షించి ప్రతీరోజు నీరందించాలన్నారు. గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పారిశుద్యం, ప్రభుత్వ కార్యక్రమాలు అమలయ్యేలా పంచాయతీ కార్య దర్శులు పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈ వో గోవింద్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

ఖానాపూర్ : తమ కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని సమస్యను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్‌ను ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు కోరారు. బుధవారం ఖానాపూర్‌లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో సమస్యలను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు స్థానిక మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యనారాయణ సమస్యలను వివరించారు. కాలనీలో నీటిఎద్దడి తీర్చేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామ ఛైర్మన్ వివరించారు. కాలనీ సమీపంలో నుంచి ఎగ్బాల్‌పూర్ వెళ్లే మిషన్ భగీరథ లైన్ ద్వారా డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీలుకానిట్లయితే కొత్తబోర్లు వేసేందుకు స్థలాన్ని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను ఆయన ఆదేశించారు. వీలైనంత త్వరగా కాలనీలో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు చేపట్టండి

- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : జిల్లాలో యాసంగి 2024 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సెర్ప్ ఆధ్వర్యంలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన తరువాతే రైతులకు ధాన్యం బస్తాలు పంపిణీ చేయాలన్నారు. రేట్లు, ఇతర సమాచారం తెలిసేలా బోర్డుల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడం లాంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, సివిల్ సప్లై అధికారి నందిత, మేనేజర్ శ్రీకళ, మార్కెటింగ్ ఏడీఎం అశ్వక్, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ జానకి షర్మిల



సమీక్ష చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మార్చి 20 : జిల్లాలోని పోలీసుస్టేషన్‌లో పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలపై పకడ్బందీ విచారణ చేపట్టి నిందితులను కఠినంగా వ్యవహరించాలన్నారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీసీటీఎన్ఎస్ వెబ్ పేజ్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని, ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. న్యాయాధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ నేరస్తులకు శిక్షపడేలా బాధ్యత వహించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, చేపట్టాల్సిన భద్రత, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది క్రమశిక్షణగా పని చేసి ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నగదు రవాణాపై తనిఖీలు, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర వాటిపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు, స్టేషన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీసుల తనిఖీల్లో రూ.1.2 లక్షల నగదు సీజ్

భైంసా, మార్చి 20 : పట్టణంలోని నాందేడ్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు చేపట్టిన వాహనాల తనఖీల్లో రూ.1.2 లక్షలు నగదు పట్టుబడింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ ఎస్ఐ ఎండీ గౌస్ సారధ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే ముథోల్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్ లక్ష్మణ్ అనే వ్యక్తి రూ.1.2 లక్షల నగదును ద్విచక్ర వాహనంలో పెట్టుకొని వస్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు సదరు వ్యక్తి చూపెట్టకపోవడం వలన సీజ్ చేసినట్లుగా ఎస్ఐ ఎండీ గౌస్ వెల్లడించారు.

విద్యుత్ తీగల చోరీ

నర్సాపూర్(జి), మార్చి 20 : మండలంలోని చాక్‌పల్లి శివారం వ్యవసాయ భూముల్లోని విద్యుత్ మోటార్ కేబుల్ వైర్లు, సర్వీస్ వైర్లు గుర్తుతెలియని దొంగలు కత్తిరించుకు పోయారని మండల కేంద్రానికి చెందిన నడిపి రాందాస్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.


గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

పెంబి, మార్చి 20 : గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. బుధవారం మండలంలోని నాగపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం ప్రోగ్రాంలో భాగంగా గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాఆట్లడుతూ... గర్భిణీలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, చిత్రకళ, రాధా, ఫైంజా, అంగన్‌వాడీ టీచర్లు సంపూర్ణ, నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వస్తువులు విక్రయించడానికి వేలంపాట



వేలంపాటను నిర్వహిస్తున్న దృశ్యం

సారంగాపూర్, మార్చి 20 : మండలంలో గల అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద వస్తువులు విక్రయించడానికి బుధవారం వేలంపాటను నిర్వహించినట్లు ఆలయ ఈవో రంగు రవికిషన్ గౌడ్ తెలిపారు. ఈ వేలం పాటలో చీరలను అమ్ముకోవడానికి రూ. 4 లక్షల 80 వేలు ఇతర వస్తువులను విక్రయించడానికి రూ. 2 లక్షల 98 వేలు వేలంపాటలో వచ్చినట్లు తెలిపారు. ఈ వేలంపాట కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.